**కథ**

# ఎన్నాళ్ళిలా?

సి.ఎన్.చంద్రశేఖర్

"మీకు ఉత్తరం వచ్చింది" ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి ఈజీచైర్‌లో కూర్చుని కాఫీ త్రాగుతున్న భర్తతో అంది సావిత్రి.

"ఎక్కడ్నుంచి" ఉత్తరం అందుకుంటూ అడిగాడు రామారావు.

"తెలియదు. నేను ఉత్తరం చించలేదు"

ఇన్‌ల్యాండ్ ఉత్తరం అది. ఉత్తరం చదివిన రామారావు దాన్ని ప్రక్కనున్న స్టూలుపై పెడుతూ "మీ అన్నయ్య చెప్పిన సంబంధం తాలూకు పెళ్ళికొడుకు రాశాడు ఉత్తరం. ఈ ఆదివారం సాయంత్రం అమ్మాయిని చూడటానికి వస్తున్నాడట" అన్నాడు.

ఆమె మనసు ఓ క్షణం ఆనందంతో నిండిపోయింది. అంతలోనే ఆమె ముఖంలో నిరుత్సాహం క్రమ్ముకుంది.

"నాకు గుర్తుండి దాని పెళ్ళిచూపుల సంఖ్య ముప్ఫైదాటి ఉంటుంది ఈ ఎనిమిదేళ్ళలో. అమ్మాయిని చూడ్డానికి వస్తున్నారంటే ఆశ. వాళ్ళు వచ్చి వెళ్ళాక నిరాశ. ఇక వాళ్ళకు సేవలు చేసే ఓపిక నాకు లేదు. ఈసారి స్వీటు, హాటు షాపు నుంచి తెచ్చెయ్యండి. కాఫీ మాత్రం చేసి యిస్తాను. ఇంతకూ ఎంతమంది వస్తామని రాశారు?"

"ఆ విషయం రాయలేదు. నువ్వు అమ్మాయితో మాట్లాడి తనను మానసికంగా సిద్ధం చెయ్యి. ఈసారి పెళ్ళిచూపుల్లో కూర్చోనని ఎక్కడ మొండికేస్తుందో అని నాకు భయంగా ఉంది"

"నాకూ ఆ అనుమానం ఉంది. పాపం అందరి ముందూ అలా తల వంచుకుని కూర్చుని కూర్చుని దానికీ విసుగొచ్చి ఉంటుంది. భగవంతుడి దయవల్ల ఈసారన్నా కుదిరితే బావుణ్ణు"

"ఈ సంబంధం కుదురుతుందని నాకు నమ్మకం ఉంది" అన్నాడు రామారావు.

★ ★ ★

ఆ రోజు రాత్రి భోజనాలయ్యాక చాలాసేపు ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు రామారావు. 'తన కూతురు పావని అందగత్తె కాదు. అలాగని అనాకారీ కాదు. చామనఛాయ మేనిరంగుతో చూడటానికి చక్కగానే ఉంటుంది. 'కాకి పిల్ల కాకికి ముద్దు' అన్న విధంగా తమ కళ్ళకు చక్కగా కనిపిస్తుందేమో తెలియదు. నిజానికి సావిత్రి కూడా అందగత్తె కాదు. పెళ్ళిచూపుల్లో చూసి వెంటనే ఒప్పుకున్నాడు కానీ పెళ్ళయిన తర్వాత 'తను మరికొన్ని సంబంధాలు చూసి మరింత అందగత్తెను చేసుకోవాల్సింది' అనుకున్నాడు. అయితే ఆ తర్వాత అటువంటి ఆలోచన తనకు రాలేదు. అందుకు కారణం సావిత్రిలోని చురుకుదనం. మొదటగా తనని ఆకర్షించింది ఆమె చేతి వంట. ఏ వంటకాన్నయినా అత్యంత రుచిగా వండటం ఆమె ప్రత్యేకత. అలాగే శృంగారంలో ఆమె తీసుకునే చొరవ తనని ఆకట్టుకుంది. బంధుజనంలో మంచిపేరు తెచ్చుకుంది. బంధుమిత్రుల ఇండ్లలో శుభకార్యాలు జరిగితే సావిత్రి అక్కడ ఉండాల్సిందే. తన వంతు సాయం చేయాల్సిందే. అలాగే ఎవరికి ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ వెళుతుంది. అందుకే ఆమెను చేసుకున్నందుకు తర్వాత ఎప్పుడూ బాధపడలేదు తను.

పావనికి అన్నిట్లోనూ తల్లి పోలికలే వచ్చాయి. అన్ని పనులూ చక్కగా చేస్తుంది. వంట బాగా నేర్చుకుంది. జాలి గుండె. ఎవరు బాధపడినా చూడలేదు. చక్కగా డిగ్రీ చదువుకుంది. కంప్యూటర్ కోర్సులు చాలా చేసింది. ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ నెలకు నాలుగు వేలు సంపాదిస్తుంది. భగవంతుడు చల్లగా చూసి ఈ సంబంధం కుదిరితే తను యిక జీవితంలో ఆయన్ను కోరుకునేదేమీ ఉండదు' అనుకున్నాడు.

"ఏమండీ..మీరింకా నిద్రపోలేదా?" అంటూ వచ్చింది సావిత్రి.

"నిద్ర రావడం లేదు. నువ్వు అమ్మాయికి విషయం చెప్పావా?"

"చెప్పాను. అన్నిటికీ సరేనంది. అది బంగారమండీ"

"అవును. అయితే మెరిసే బంగారం కాదు. అందుకే సంబంధం కుదరలేదు. మెరిసేదంతా బంగారం. కానట్లే మెరవనంత మాత్రాన బంగారం బంగారం కాకుండా పోదు. ఆ విషయం ఈ కాలం పెళ్ళికొడుకులకు అర్థం కాదు"

"బాగుంది మీ కొటేషన్. ఇక పడుకోండి మీరు. ఇప్పటికే ఆలస్యమైంది"

రామారావు వెల్లకిలా పడుకుంటే అతని భుజంపై తన గడ్డం ఆన్చి, అతనిపై చెయ్యి వేసుకుని పడుకుంది సావిత్రి. అలా పడుకుంటే ఆమె మనసుకు నిశ్చింతగా, హాయిగా ఉంటుంది. తొందరగా నిద్రపడుతుంది.

నిద్రపోతున్న భార్య తలపై చేయి వేసి ఆప్యాయంగా నిమిరాడు రామారావు.

★ ★ ★

ప్రక్కగదిలో పడుకున్న పావనికి కూడా నిద్ర రావడం లేదు. రేపు తనకి మళ్ళీ పెళ్ళిచూపులు. గత అనుభవాల వల్ల యిక పెళ్ళిచూపులంటే వద్దనాలనుకుంది. 'పెళ్ళి కాకుండా ఉంటేనేం? అవివాహితగా తను బ్రతకలేదా?' అనుకుంది. అయితే ఎక్కడికెళ్ళినా 'యింకా పెళ్ళి కాలేదా?' అంటూ ఆశ్చర్యకర చూపులు, ఎగతాళి మాటలు ఎదురవుతున్నాయి. ఇవన్నీ తప్పించుకోవాలంటే తనకు పెళ్ళి కావాలి. ఓ వరుడు కావాలి. అతను ఎట్లున్నా ఫరవాలేదు. ఏ ఉద్యోగం చేస్తున్నా ఫరవాలేదు. తన మనసును అర్థం చేసుకునే మనిషైతే చాలు. అతనితో అడవిలోకి నడవడానికి కూడా తను సిద్ధంగా ఉంది.

ఆరోజు తండ్రిలాగే ఆమెకూ చాలా ఆలస్యంగా నిద్రపట్టింది.

★ ★ ★

ఆదివారం సాయంత్రం తను ఇంటికి వచ్చిన పార్థసారథి ఎంతో నచ్చాడు రామారావు దంపతులకు. అతని ముఖంలో ప్రశాంతత. కళ్ళలో కనిపించే నిజాయితీ వారినెంతో ఆకర్షించింది.

"మీ పెద్దలుగాని, చెల్లెళ్ళుగాని రాలేదా బాబూ" ఇంట్లోకి ఆహ్వానించి అతను సోఫాలో కూర్చున్నాక అడిగాడు రామారావు.

"రాలేదండి. మీకు రమణయ్యగారు చెప్పే ఉంటారు. నాకు అమ్మా నాన్నా లేరు. నాన్న ఉద్యోగం నాకొచ్చింది. ముగ్గురు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేసి నా బాధ్యత పూర్తి చేశాను. ఇప్పుడు నా వయసు ముప్ఫై అయిదు. నా గురించి ఆలోచించే తీరిక నాకు దొరికిందిప్పుడు. చెల్లెళ్ళు చాలా దూరంలో ఉన్నారు కాబట్టి యీరోజు రాలేదు. పెళ్ళికి మాత్రం అందరూ వస్తారు"

అమ్మాయి నచ్చి పెళ్ళి జరగబోతున్నట్లే మాట్లాడుతున్న అతనిలో అమాయకత్వం కనిపించింది సావిత్రికి. పెళ్ళి జరుగుతుందన్న ఆశ కూడా కలిగింది.

"అమ్మాయిని తీసుకురానా?" అని అడిగిందతన్ని.

"వచ్చి సోఫాలో కూర్చోమనండి. ఎటువంటి ఫార్మాలిటీస్ అవసరం లేదు. క్యాజువల్‌గా ఉండమనండి"

పావని వచ్చి సోఫాలో తలవంచుకుని

కూర్చుంది. అతను పావనినే చూస్తున్నాడు. కొద్ది నిమిషాల తర్వాత "మీ పేరు?" అని అడిగాడు.

"పావని"

"నా పేరు పార్థసారథి. ఏం చదివారు?"

"బి.ఎస్సీ"

"వెరీగుడ్..నేనూ బి.ఎస్సీనే"

ఆ తర్వాత అతను రామారావుతో మాట్లాడుతుంటే ముందుగా సావిత్రి, తర్వాత పావని కూడా వారి సంభాషణలో పాలుపంచుకున్నారు.

'ఈయనతో మాట్లాడుతూంటే ఎన్నో రోజుల్నుంచి పరిచయం ఉన్న వ్యక్తితో మాట్లాడుతున్నట్లే ఉంది' అనుకుంది పావని.

సావిత్రి స్వీటు, హాటు యివ్వబోతే వద్దన్నాడు. కాఫీ మాత్రం త్రాగాడు. తర్వాత పావని, సావిత్రిల దగ్గర శెలవు తీసుకుని బయటకు వచ్చాడు రామారావుతో "మీ అమ్మాయి నాకు నచ్చింది. మీ అమ్మాయికి నేను నచ్చితే ముహూర్తం పెట్టించండి. నాకు కట్నకానుకలు అఖ్ఖర్లేదు. పెళ్ళి సింపుల్‌గా గుడిలో చెయ్యండి. అనవసరపు ఖర్చులు పెట్టుకోకండి. మీ అమ్మాయి పెళ్ళి చేశాక మీరు మానసికంగానే కాదు, ఆర్థికంగా కూడా ఆనందంగా, కంఫర్టబుల్‌గా ఉండాలి" అన్నాడు పార్థసారథి.

రామారావు అతని చేయి అందుకుని "మేము అదృష్టవంతులం" అన్నాడు ఆనందంగా.

"నిజం చెప్పాలంటే అదృష్టం నాది. ఎందుకంటే మీ కుటుంబంలో ఓ వ్యక్తి అవుతున్నందుకు. మీతో మాట్లాడుతూంటే మా అమ్మానాన్నల్తో మాట్లాడుతున్నట్లే ఉంది నాకు"

"మీకు సెల్‌ఫోన్ ఉందా?" పార్థసారథి బయలుదేరుతూంటే అడిగాడు రామారావు.

"లేదండీ..ఏదైనా అవసరమైతే ఆఫీసుకుగాని, ఇంటికి గాని ఫోన్ చెయ్యండి" అంటూ ఫోన్ నెంబర్లు చెబితే తన సెల్‌లో ఫీడ్ చేసుకున్నాడు రామారావు. అలాగే పార్థసారథి రామారావు ఫోన్ నెంబర్లు అడిగి రాసుకున్నాడు.

పార్థసారథి వెళ్ళిపోయాక ఇంట్లోకి వచ్చి అబ్బాయి ఎలా ఉన్నాడని సావిత్రిని అడిగాడు.

"నాకు బాగా నచ్చాడు. అమ్మాయికీ నచ్చినట్లే ఉంది.. మీకు.."

"నాకు బాగా నచ్చాడు"

* * *

ఆ రోజు సాయంత్రం పార్థసారథి పావనికి ఫోన్ చేశాడు.

"బావున్నారా?" అని అడిగాడు.

"బాగున్నాను.. మీరు.."


"నేనూ బావున్నాను. వచ్చే వారమే మన పెళ్ళి"

"అవును"

"నా కాబోయే శ్రీమతికి ఓ పట్టుచీర ప్రెజెంట్ చెయ్యాలని అనుకుంటున్నాను. అయితే చీరల సెలక్షన్‌లో నాకంతగా ప్రావీణ్యత లేదు. మీకు అభ్యంతరం లేకపోతే నాతో వచ్చి నాకు సాయం చేస్తారా?"

"తప్పకుండా మీ కాబోయే శ్రీమతి అదృష్టవంతురాలు"

"ఆమెకు కాబోయే భర్త కూడా అదృష్టవంతుడే సుమా. రేపు సాయంత్రం నేను ఆఫీసునుంచి వచ్చేటప్పుడు దిల్‌షుక్‌నగర్‌లో దిగుతాను. మా కంపెనీ బస్సు దిల్‌షుక్‌నగర్‌కు సాయంత్రం ఆరుగంటలకు వస్తుంది. మనం సాయిబాబా గుడి దగ్గర కలుసు



కుందాము"

"అలాగే"

మరుసటిరోజు సాయంత్రం తల్లితో చెప్పి బయలుదేరింది పావని. ఆమె గుడి చేరుకునేప్పటికి సమయం ఐదున్నర. గుడిలోపలికి వెళ్ళి దేవుడి దర్శనం చేసుకుని బయటికొచ్చి నిలబడి పార్థసారథి కోసం ఎదురు చూడసాగింది.

ఇంతలో ఉన్నట్లుండి షాపు వాళ్ళు షట్టర్లు దించెయ్యసాగారు. జనం రోడ్లో పరుగెత్తసాగారు. ఆటోలు మాయమయ్యాయి. కొద్ది నిమిషాల్లో రోడ్డు మీద జనం పలుచబడ్డారు.

పావని తన ప్రక్కనుంచి వెళుతున్న ఓ వ్యక్తిని ఏం జరిగిందని అడిగింది.

"ఓ రాజకీయ నాయకుడు హత్యకు గురయ్యాడని, సిటీలో గొడవలు మొదలయ్యే అవకాశం ఉంది కాబట్టి త్వరగా ఇల్లు చేరమని" సలహా యిచ్చి వెళ్ళిపోయాడు.

పావని పరుగులాంటి నడకతో ఇల్లు చేరింది. అప్పటికి రామారావు ఇంటికి వచ్చి ఉన్నాడు. టీవీలో వార్తలు చూస్తున్నాడు. పావని కుర్చీ లాక్కుని తండ్రి ప్రక్కనే కూర్చుని వార్తలు చూడసాగింది.

ఆమెకు పార్థసారథి గురించి కంగారుగా ఉంది. 'ఈపాటికి ఆఫీసు వదలి మార్గమధ్యంలో ఉండి ఉంటాడు. దిల్‌షుక్‌నగర్‌లో దిగి తన కోసం వెతుకుతాడా? అయ్యోపాపం. అక్కడ దిగి నేరుగా తమ ఇంటికి వచ్చేసినా బాగుణ్ను. రాత్రి తమ ఇంట్లోనే పడుకుని ఉదయం పరిస్థితి చూసుకుని బయలుదేరవచ్చు' అనుకుని ఆందోళన చెందసాగింది. అతన్ని సెల్ కొనమని తను చెప్పి ఉండాల్సింది. లేదా తనే ఓ సెల్ కొని అతనికి ప్రెజెంట్ చేసి ఉండాల్సింది. ఇటువంటి పరిస్థితి వచ్చినప్పుడు అతని క్షేమం గురించి తను యింత టెన్షన్ పడే అవసరం లేకుండా వెంటనే అతనెక్కడున్నాడో తనకు తెలిసిపోయుండేది అనుకుంది. మళ్ళీ 'నెలక్రితం అతనెవ్వరో, తనెవ్వరో? ఈరోజు అతని గురించి యింతగా ఆందోళన పడుతూంది. మనుషుల మధ్య బంధాలు ఎంత త్వరగా ఏర్పడతాయ్' అనుకుని ఆశ్చర్యపోయింది.

"కాళ్ళు చేతులు కడుక్కుని దేవుని దగ్గర దీపం వెలిగించమ్మా..నాకు వంట గదిలో కాస్త పని వుంది" అంటూ లేచింది సావిత్రి.

"అలాగే" అంటూ పావని కూడా లేచి బాత్‌రూమ్ వైపు నడిచింది.

అంతలో టీవీలోంచి వినిపించిన ఓ వార్త వాళ్ళను టీవీ దగ్గరకు చేర్చింది.

"మలక్‌పేటలోని టీవీ టవర్ వద్ద ఆందోళనకారులు ఓ ప్రైవేటు సంస్థకు చెందిన బస్సును తగులబెట్టారు. అందులోని సంస్థ ఉద్యోగులు భయంతో ఒక్కసారిగా బస్సు దిగడానికి ప్రయత్నించడంతో బస్సులో త్రొక్కిసలాట జరిగింది. ఈ సంఘటనలో ముగ్గురు ఉద్యోగులు మంటల్లో చిక్కుకుని మరణించారు."

పావని మాట రానట్టు నిలబడిపోయింది. రామారావు, సావిత్రిల పరిస్థితి కూడా అలాగే ఉంది. అందుకు కారణం ఆ బస్సు పార్థసారథి పనిచేస్తున్న కంపెనీది కావడమే. "భగవాన్ ఆయనకు ఏ ఆపదా కలగకుండా చూడు స్వామీ" అంటూ ముగ్గురూ తమ తమ యిష్టదైవాల్ని వేడుకోసాగారు.

కాలం గడిచేకొద్దీ వాళ్ళలో ఏ మూలో ఉన్న ఆశ సడలిపోసాగింది 'అతనికి ఏ ఆపదా కలగకుండా ఉండి ఉంటే ఈపాటికి ఫోన్ చేసి ఉండేవాడు. పావని ఇల్లు చేరిందా అని ఆతృతగా వెలిబుచ్చేవాడు. ఆ మరణించిన ముగ్గురిలో పార్థసారథి ఒకడు కాదు కదా' అని భయపడసాగారు. పావని రోదించసాగింది. సావిత్రి ఊరడించడానికి ప్రయత్నిస్తూంది కానీ ఆమెకీ దుఃఖం ఆగడం లేదు. రామారావు మాత్రం మౌనంగా ఆలోచిస్తూండిపోయాడు.

'వ్యక్తిగత కక్షలకు ఓ ప్రముఖ వ్యక్తి బలి అయిపోతే విచారించవలసిన విషయమే. అయితే దోషులను పట్టుకోవడానికి పోలీసు యంత్రాంగం ఉంది. విచారణ జరిపి శిక్షించడానికి చట్టం ఉంది. న్యాయస్థానం ఉంది. మరి చనిపోయిన వ్యక్తి సానుభూతిపరులు యిలా విధ్వంసాలకు పాల్పడుతూ ప్రాణనష్టం, ఆస్తినష్టం కలిగిస్తూంటే ఎవరూ ఆపలేరా? ఇటువంటి సంఘటన జరిగినప్పుడు మీడియా సామాజిక బాధ్యత వహించి ప్రభుత్వం భద్రతాచర్యలు చేపట్టిన తర్వాత ఆ వార్తను విడుదల చేయకూడదా? సాయంత్రం ఆ సంఘటన జరిగితే ఓ రెండు మూడు గంటలు ఆ వార్తను ఆపగలిగితే అందరూ యిళ్ళు చేరుతారు. ముఖ్యంగా స్కూలు పిల్లలు, ఆడపిల్లలు ఇళ్ళు చేరాక, పోలీసు యంత్రాంగం అప్రమత్తం అయ్యాక ఆ వార్త విడుదల చేస్తే ఆస్తి నష్టాన్ని అంతో యింతో తగ్గించొచ్చు కదా. ప్రజల్లో ఆందోళన తగ్గుతుంది. ఆందోళనకారులతో సంఘ వ్యతిరేక శక్తులు కలసిపోయి యిలా బస్సుల్నీ రైళ్ళనీ తగలబెడుతూంటే అందులో ప్రయాణిస్తున్న వారికి ఎంత ఆందోళన, వారికై ఇంట్లో ఎదురుచూస్తున్న ఆత్మీయుల్లో మరెంత ఆందోళన? ఈ మధ్యనే రాస్తారోకో, రైలురోకో అంటూ ప్రజల్ని యిబ్బంది పెట్టకూడదని కోర్టు ఉత్తర్వులిచ్చింది. ఇటువంటి సంఘటన జరిగినప్పుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే కాదు సమాజంలోని ప్రతి వ్యక్తిదీ'

సమయం తొమ్మిది గంటలైంది. భోజనాలకు కూడా లేవకుండా ముగ్గురూ అలాగే కూర్చుండిపోయారు. అప్పుడు మ్రోగింది ఫోన్. పావని పరుగెత్తినట్లే వెళ్ళి రిసీవర్ అందుకుంది.

"పావనిగారూ నేను పార్థసారథిని. ఈరోజు నేను ఆఫీసుకు సెలవు పెట్టాను. సాయంత్రం మిమ్మల్ని కలుసుకోవాలని బయలుదేరాను. దారిలో బస్సు నిలిపేశారు. మీకు ఫోన్ చేద్దామంటే ఎక్కడా పబ్లిక్ ఫోన్‌లు లేవు. షాపులన్నీ బంద్. బస్సులో ఎవరి దగ్గర్నుంచైనా సెల్ తీసుకుని మీకు కాల్ చేద్దామనుకున్నాను గానీ మొహమాటం వల్ల అడగలేకపోయాను. ఇప్పుడే ఇల్లు చేరి మీకు ఫోన్ చేస్తున్నాను. మీరు క్షేమంగా ఇల్లు చేరారు కదా? మీరు డిసప్పాయింట్ అయ్యారా? సారీ. మన పెళ్ళయ్యాక మిమ్మల్ని రోజూ షాపింగ్‌కు తీసుకెళతానుగా. ఓ.కె."

అవతలి పక్క అతని మాటల ప్రవాహం ఆగడం లేదు. ఇటుప్రక్క పావని కంటినుంచి నీటి ప్రవాహం ఆగడం లేదు.

"థాంక్యూ...థాంక్యూ సారథిగారూ. థాంక్యూ..భగవాన్" అన్న పదాలు మాత్రం ఆమె నోటి నుంచి వచ్చాయి.

తర్వాత సారథి క్షేమంగా వున్న విషయం తల్లిదండ్రులతో చెప్పింది. సావిత్రి ఎంతో సంతోషించింది. రామారావూ సంతోషించాడు కానీ వెంటనే మామూలు మనిషి కాలేకపోయాడు.

'తన కాబోయే అల్లుడు క్షేమంగా ఉన్నాడు. మంచిదే. మరి చనిపోయిన ఆ అభాగ్యులెవ్వరు? వాళ్ళలో ఓ వ్యక్తి మరో కన్య ఆశల పల్లకిలో విహరించే వరుడయి ఉండవచ్చు. మరో వ్యక్తి తన తల్లిదండ్రులకు ముద్దుల బిడ్డ అయి ఉండవచ్చు. ఇంకో వ్యక్తి తన భార్యను కళ్ళలో పెట్టుకుని చూసుకునే భర్త అయి ఉండవచ్చు. తన పిల్లలకు ప్రాణప్రదమైన తండ్రి అయి ఉండవచ్చు. వాళ్ళను పోగొట్టుకున్న తల్లిదండ్రుల, భార్యాపిల్లల శోకాన్ని ఎవరు ఆపగలరు? ఆ నష్టాన్ని ఎలా పూడ్చగలరు? ఎన్నాళ్ళు యిలా ప్రతి మనిషి ఆందోళనతో జీవించాలి?' అనుకున్నాడు బాధగా.

★

